# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక


RANGAREDDY, EDITION : 01, VOLUME :135 EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 26 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 135 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 26 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## డిసెంబర్ 7న ఎన్నికలు..?

### తాత్కాలిక షెడ్యూల్ సిద్ధం చేసిన ఈసీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణలో ఎన్నికల శంఖారావం మోగనుంది. జమిలీ ఎన్నికల పేరుతో ఇప్పటి వరకు కాస్త సందిగ్ధత కనిపించింది. లెక్క ప్రకారం డిసెంబర్‌లోనే ఎన్నికలు జరుగుతాయా... లేక... ఒకే దేశం-ఒకే ఎన్నిక ఫార్ములా అమల్లోకి

మిగతా 2లో...

## 30నే పాలమూరుకు ప్రధాని





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ముందుకు జరిగింది. అక్టోబర్ 2వ తేదీ అనుకున్నా.. ఇప్పుడు ఆ టూర్ ముందుకు జరిగింది. సెప్టెంబర్ 30వ తేదీనే తెలంగాణకు వస్తున్న మోదీ.. మహబూబ్ నగర్ లో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 30న మహబూబ్ నగర్ టౌన్ లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు మోదీ హాజరుకానున్నారు. 30వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని మోదీ సభా వేదిక వద్దకు చేరుకుంటారు. ప్రధాని సభను 2023 ఎన్నికల శంఖారావం సభగా బీజేపీ రాష్ట్ర నేతలు చెబుతున్నారు. బహిరంగ సభను చాలా ప్రతిష్టత్మకంగా తీసుకున్న బీజేపీ నాయకులు.. కనీసం లక్ష

మిగతా 2లో...

# ఎమ్మెల్యేల బరిలో ఎంపీలు

- ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటన
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన స్వంత నియోజకవర్గం అయిన నల్గొండ సీటు నుంచి మరొకమారు పోటీ




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండనున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి క్లారిటీ రాగా? రేపోమాపో కాంగ్రెస్, బీజేపీ నుంచి అధికారికంగా ప్రకటన వెలువడనుంది. తెలంగాణలో అధికారం చేజిక్కుంచు కోవటం లక్ష్యంగా.. ప్రధాన పార్టీలు తమ సిట్టింగ్ ఎంపీలను అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపుతున్నాయి. ఇప్పటికే భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం నుండి మరోసారి పోటీ చేయనున్నారు. అదేవిదంగా.. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన స్వంత నియోజకవర్గం అయినా నల్గొండ సీటు నుంచి

మిగతా 2లో...

## కలిసికట్టుగా పని చేయండి

### రాష్ట్ర మంత్రి కేటీఆర్



కమాన్ పూర్ - ప్రభాత సూర్యుడు

మంథని నియోజకవర్గం లో కలిసికట్టుగా పనిచేసి బి ఆర్ ఎస్ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మంథని నియోజకవర్గం లోని పలువురు నాయకులను కోరారు. కమాన్ పూర్ మాజీ జెడ్పిటిసి గంట వెంకట రమణా రెడ్డి కి భవన్ నుండి పిలుపు అందడంతోనే హుటాహుటిన హైదరాబాద్ కు బయలుదేరి ప్రగతిభవన్ లో మంత్రి మంత్రివర్యులు టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్

మిగతా 2లో...

## పీఓపి విగ్రహాల నిమజ్జనం వద్దు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనంపై తెలంగాణ హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను హుస్సేన్ సాగర్ లో, చెరువుల్లో నిమజ్జనం చేయవద్దని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) తో తయారు చేసిన గణేష విగ్రహాలు అన్నింటిని జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కృత్రిమ తాత్కాలిక నీటి కుంటల్లో మాత్రమే నిమజ్జనం చేయాలని హైకోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. హైకోర్టు తాజాగా ఇచ్చిన ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కు, జీహెచ్ఎంసీ కమిషనర్ కు ఆదేశాలు ఇచ్చింది తెలంగాణ రాష్ట్ర హైకోర్టు. ఇదే సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీన వినిపించిన వాదనల సమయంలోన్ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ)తో తయారు చేసిన గణేష్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్ తో పాటు చెరువుల్లో నిమజ్జనం చేయవద్దని.. ఈ విషయంపై గత సంవత్సరం ఇచ్చిన ఉత్తర్వులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని హైకోర్టు పేర్కొంది. పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం ఎత్తేయాలని.. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) నిబంధనలను కొట్టి వేయాలని పేర్కొంటూ గణేష్ మూర్తి కళాకారుల సంక్షేమ సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్ కుమార్ లతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ ల తరఫు న్యాయవాది.. ధూల్ పేట్ వాసులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా ప్రస్తుత ఉపాధిని దెబ్బతీయడం సరికాదని పేర్కొన్నారు.

మిగతా 2లో...

## మైనంపల్లి వర్సెస్ పద్మాదేవేందర్ రెడ్డి?



మెదక్- ప్రభాత సూర్యుడు

మెదక్ కేంద్రంగా సరికొత్త రాజకీయం మొదలైంది. మైనంపల్లి రాజీనామాతో ఆయన కుమారుడు ఈ సీటు నుంచి బరిలో ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఫలితంగా ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవెందర్ రెడ్డి వర్సెస్ మైనంపల్లి అన్నట్లు మారింది. తెలంగాణలో రాజకీయ వేడి మొదలైంది. ఎన్నికల ఏడాది కావటంతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహాలు, ప్రతివ్యూహాలతో పాటు పక్కా ప్లాన్ తో అడుగులు వేసే పనిలో పడ్డాయి. ఇక అధికార బీఆర్ఎస్ ఎలాగైనా హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. ఇప్పటికే అభ్యర్థులను కూడా ప్రకటించింది. అయితే పార్టీకి

మిగతా 3లో...

## ఆసియా క్రీడల్లో తొలి స్వర్ణ పతకం సాధించిన ఇండియా




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు


ఆసియా క్రీడల్లో రెండో రోజును భారత్ ఘనంగా ప్రారంభించింది. మొదటి రోజు ఐదు పతకాలను ఖాతాలో వేసుకున్న ఇండియా.. నేడు తొలి స్వర్ణ పతకం సాధించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ విభాగంలో టీమ్‌ఇండియా గోల్డ్ మెడల్‌ను ముద్దాడింది. రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, దివ్యాన్ష్ సింగ్ పన్వర్‌తో కూడిన భారత జట్టు ఫైనల్‌లో 1893.7 పాయింట్లు నమోదుచేసి ప్రపంచ రికార్డును బద్దలుకొట్టారు. దీంతో బాకు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చైనా నెలకొల్పిన 1893.3 పాయింట్ల రికార్డు

మిగతా 2లో...

## తెలంగాణ వీర వనిత మన చాకలి ఐలమ్మ

### నేడు ఆమె జయంతి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మ గా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత. వీరు 26 సెప్టెంబర్ 1919లో జన్మించి 10 సెప్టెంబరు 1985లో పరమపదించారు. 1919 లో వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామం లో ఓరుగంటి మల్లమ్మ, సాయిలు కు నాలోగ్గో సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించింది. పాలకుర్తి కి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు ,ఇద్దరు కుమార్తెలు . ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం, చాకలి కులవృత్తే వారికి జీవనాధారం. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ. అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా'అని ఉత్పత్తికులాల (బీసీ కులాల) చేత పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నతకులాలతో పాటు వారి అనుంగు ఉంపుడుకత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి ఆఘాయిత్యం చేయించేవారు. ఈ భూమినాది. పండించిన పంటనాది. తీసుకెళ్లడానికి దొరెవ్వడు. నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రె?తాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ. మల్లంపల్లి భూస్వామి కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల

మిగతా 3లో...

## బ్రిజ్ భూషణ్‌కు బిగిస్తున్న ఉచ్చు




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్‌కి ఢిల్లీ పోలీసులు షాక్ ఇచ్చారు. అవకాశం దొరికినప్పుడల్లా వాళ్లని వేధించినట్టు ఢిల్లీ కోర్టులో వెల్లడించారు. ఆయనపై చర్యలు తీసుకోవడానికి అవసరమైన ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. నిజానికి ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో భూషణ్ సింగ్ కూడా విచారణకు హాజరవ్వాల్సి ఉన్నప్పటికీ కోర్టు అందుకు మినహాయింపునిచ్చింది. తజికిస్థాన్‌లో మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించినట్టు పోలీసులు కోర్టుకి వెల్లడించారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌కి తాను చేసేది తప్పు అని

మిగతా 3లో...

# కలిసికట్టుగా పని చేయండి

(మొదటిపేజీ తరువాయి)


ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుని కలిశారు. ఈ సందర్భంగా గంట వెంకటరమణారెడ్డి కేటిఆర్ కుపలు విషయాలను ఉద్యమకారులము మానసికంగా ఆర్థికంగా సరైన గుర్తింపు లేక మానసిక వేదన అనుభవిస్తున్న ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని కోరుతూ భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. గతంలో జరిగిన ఎలక్షన్స్ లో వీరి ప్రభావం ఇంటలిజెన్స్ రిపోర్ట్ ద్వారా తెలుసుకొని మరియు ఉద్యమకారులైన మీ యొక్క భవిష్యత్ కి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలపడం జరిగింది అని కేటీఆర్ తెలిపినట్లు రమణారెడ్డి అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ని కూడా మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది వారు కూడా భరోసా ఇవ్వడం జరిగింది.ప్రస్తుతం గంట వెంకటరమణారెడ్డి ఉద్యమ సమయంలో కేసీఆర్ పిలుపు మేరకు తన జెడ్పిటిసి పదవికి రాజీనామా చేసి పెద్ద ఎత్తున సెంటినరీ కాలనీలో కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్ లో జాయిన్ అవ్వడం జరిగింది .అనంతరం జరిగిన ఉద్యమ కార్యాచరణలో కేసీఆర్ ఇచ్చిన ప్రతి పిలుపుని విజయవంతంగా జనాల్లోకి తీసుకెళ్లి టిఆర్ఎస్ ను మంథని నియోజకవర్గంలో బలోపేతం చేయడంలో అతి ముఖ్య పాత్ర పోషించడం జరిగింది. ఉద్యమ సమయంలో దేశద్రోహం తో పాటు కన్నాల్లో జరిగిన రైలు రోకోలో రెండు కేసులు మరియు వీటితోపాటు 12 కేసు నమోదు చేయడం జరిగింది అయినా బెదరకుండా కమాన్పూర్ , సెంటినరీ కాలనీలో జేఏసీ చైర్మన్ 108 రోజుల దీక్ష శిబిరాన్ని నిరంతరాయంగా నిర్వహించి ప్రజల స్ఫూర్తిని నింపారు తర్వాత జరిగిన కొన్ని పరిణామాల వల్ల తన రాజకీయ జీవితానికి ఎన్ని అడ్డంకులు, అవమానాలు సృష్టించిన వాటిని తట్టుకొని సైలెంట్ గా పార్టీ అధిష్టానం మీద నమ్మకంతో పనిచేయడం జరుగుతుంది అలాంటి తరుణంలో ప్రగతి భవన్ నుంచి పిలుపు రావడంతో కేటీఆర్ రమణారెడ్డి తో మాట్లాడి భరోసా ఇవ్వడంతో రమణారెడ్డి అభిమానుల్లో తమ అభిమాన నాయకుడికి సరైన గౌరవం గుర్తింపు త్వరలో రాబోతుందని ఉత్సాహంతో ఉన్నారు.. ప్రతి ఉద్యమకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరినట్లు తెలిపారు.

# డిసెంబర్ 7న ఎన్నికలు..?

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చి 2024లో లోక్‌సభ, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు పెడతారా? అన్న అంశంపై సస్పెన్స్ కొనసాగింది. కానీ... ఆ అనుమానాలన్నీ ఇప్పుడు తీరిపోయాయి. తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించేందుకు.. ఎలక్షన్ కమిషన్ కసరత్తు చేస్తోంది. ఎన్నికల తేదీలకు సంబంధించి తాత్కాలిక షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. ఆ షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 7న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే డిసెంబర్ 11న కౌంటింగ్ నిర్వహించి... ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. ఇది తాత్కాలిక షెడ్యూలు మాత్రమే. అయినా... కొంచెం అటు ఇటుగా ఇదే సమయంలో తెలంగాణలో ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది.ఎన్నికల కమిషన్ ఇచ్చిన తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం.. అక్టోబరు 6న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. నవంబర్ 12 ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి... నవంబర్ 19న నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ముగిశాక నవంబర్ 22న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డివెంబర్ 7న ఎన్నికలు జరుగుతాయి. అక్కడి నుంచి మరో నాలుగు రోజుల తర్వాత అంటే డిసెంబర్ 11న కౌంటింగ్ ఉంటుంది. 2018లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ కూడా ఇదే. 2018లో డిసెంబర్ 7న ఎన్నికలు జరిగాయి... 11న ఫలితాలు ప్రకటించారు. ఆ తరువాత జనవరి 16న శాసనసభ తొలి సమావేశం జరిగింది. దీని ప్రకారం చూస్తే... 2024లో జనవరి 17లోపు కొత్త శాసనసభ కొలువుదీరాల్సి ఉంటుంది. అది జరగాలంటే... షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగాలి. అందుకే.. దానికి అనుగుణంగా ఈ ఏడాది అక్టోబరు మొదటి వారంలో షెడ్యూల్ విడుదలయ్యేలా ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. డిశంబర్‌లో ఎన్నికలను నిర్వహించాలంటే... ఎన్నికల కమిషన్ ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టాల్సి ఉంటుంది. ఈసీ ఆ పనిలోనే బిజీగా ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే ఈవీఎంలు, వీవీప్యాడ్ తనిఖీలు కూడా పూర్తిచేశారట. ఇక... ఒకదాని తర్వాత మరొకటి... వరుసగా ఎన్నికల పనులు జరిగిపోతాయని చెప్తున్నారు. అక్టోబర్‌లో... ఎన్నికల సామాగ్రి సమీకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన, రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారుల శిక్షణ, జిల్లాలకు నిధుల కేటాయింపు వంటి వాటిపై దృష్టి పెడతారు. ఈ పనులన్నీ అక్టోబర్‌లోపు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే... నవంబర్‌లో పోలీసు సిబ్బందికి శిక్షణ, పోలింగ్ కేంద్రాల ప్రకటన, పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ, ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల నియామకం, బ్యాలెట్ పరిశీలకులకు శిక్షణ వంటి పనులు ఉంటాయి. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ నేతృత్వంలో బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. టీమ్‌లో ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తోపాటు పలువురు అధికారులు ఉన్నారు. అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వీరి బృందం తెలంగాణలో పర్యటిస్తుంది. ఆ తర్వాత షెడ్యూల్ ప్రకటిస్తారని సమాచారం.

# ప్రతిరోజు ట్రాఫిక్ జామ్




**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు:** హైదరాబాదులో అసలే ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం. కుత్బుల్లాపూర్ సమీపంలోని కొంపల్లి లో దూలపల్లి చౌరస్తా వద్ద ప్రతిరోజు వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. కొంపల్లి నుండి దూలపల్లి మైసమ్మగూడ బహదూర్ పల్లి దారిలో వెళ్లే వాహనదారులకు ఆఫీసులకు గాని కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సుమారు అరగంట నుంచి గంటపాటు ఆలస్యం అవుతుందని ప్రయాణికులు బాధపడుతున్నారు. దూలపల్లి సమీపంలో మురికి కాల్వ బ్రిడ్జి పనులు పూర్తికాక పోవడం మరియు గుంతల రోడ్డు తో ప్రయాణికులు కళాశాలకు వెళ్లే విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మన ప్రభుత్వ మంత్రి మల్లారెడ్డి కి సంబంధించిన కళాశాలకు వెళ్లే విద్యార్థులకు ఇదే ప్రధాన రహదారి గా ఉండడం విశేషం. సంబంధిత అధికారులు ఈ పనులు పూర్తి చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని ప్రయాణికుల ఆవేదన.

# ఎమ్మెల్యేల బరిలో ఎంపీలు

(మొదటిపేజీ తరువాయి)

మరొకమారు పోటీలో ఉండబోతున్నానని సృష్టం చేశారు.ఇక నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా తిరిగి తన స్వంత నియోజకవర్గం అయినా హుజుర్ నగర్ నుంచి బరిలో ఉండాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా వీరి ముగ్గురి అభ్యర్థిత్వం పైన ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. అదేవిదంగా, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగబోతున్నారు. అరవింద్ నిజామాబాద్ అర్బన్ లేదా ఆర్మూర్ నియోజకవర్గం నుండి పోటీచేయాలని నిర్ణయిం చుకున్నట్టు తెలుస్తుంది. బండి సంజయ్ వేములవాడ కానీ? కరీంనగర్ లో ఏదైనా ఒక నియోజకవర్గం నుంచి పోటీలో ఉండాలి అని ఆలోచనలో ఉన్నారు. ఎంపీ కిషన్ రెడ్డి కూడా అంబర్ పేట నుంచి పోటీ ఉండే అవకాశం ఉంది. అదే విధంగా నామినేషన్స్ వేసే సమయానికి? ఇంకా కొంతమంది ఎంపీలు కూడా ఈ సారి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ఆశ్చర్యకరంగా, ఈ ఎంపీలు చాలామంది చివరిసారి అసెంబ్లీ ఎన్నికల్లో తమ అదృష్టం పరీక్షించుకున్నవారే. రేవంత్ రెడ్డి కొడంగల్ లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవటంతో?మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేశారు. అదేవిదంగా, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన రాజకీయ జీవితంలో మొట్టమొదటి సారిగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ లో ఓటమి చవిచూడటం జరిగింది. నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గం నుండి తాను వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యే గా పోటీచేసి గెలిశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కోదాడ, హుజుర్ నగర్ నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హుజుర్ నగర్ నుండి ఎమ్మెల్యేగా గెలిసిన, నల్గొండ లోక్ సభ సీటులో కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థిని నిలబెట్టాలి అని తలచటంతో? ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా రాజీనామా చేసి, నల్గొండ నుండి పోటీ చేసి గెలిశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో?. కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థులను నిలబెట్టడంతో ఆ పార్టీ మూడు ఎంపీ సీట్లు గెలవగలిగింది అని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.దుబ్బాక నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిసిన బిఆర్ఎస్ నాయకుడు సోలిపేట రామలింగా రెడ్డి 2020 లో ఆకస్మికంగా మరణించడంతో, ఈ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ తన సీటును కోల్పోయింది. ఆ పార్టీ రామలింగా రెడ్డి సతీమణి సుజాతని ఉపఎన్నికల బరిలో నిలపగా? బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ని పోటీలో నిలిపింది. సుజాతకి కానీ తన కుమారుడు సతీష్ రెడ్డి కి కానీ సరైన రాజకీయ అనుభవం లేకపోవడంతో? దుబ్బాక నియోజకవర్గ వాస్తవ్యుడైన కొత్త ప్రభాకర్ రెడ్డి ని పోటీలో నిలపాలి అని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నిర్ణయించుకున్నారు. ప్రభాకర్ రెడ్డి.. మెదక్ లోక్ సభ నుంచి 2014, 2019 లో గెలుపొందారు.ఇక బీజేపీ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి 2014, 2018 లో పోటీ చేసిన బండి సంజయ్, ఆ రెండు సార్లు ఓటమి పాలయ్యారు. తర్వాత వచ్చిన 2019 లోక్ సభ ఎన్నికలో మాత్రం బిఆర్ఎస్ సీనియర్ నాయకుడైన బోయినపల్లి వినోద్ కుమార్ ని కరీంనగర్ లోక్ సభ ఎన్నికల్లో ఓడించాడు. ఈ సారి సంజయ్ కరీంనగర్ నుంచి కానీ, వేములవాడ నుండి కానీ తన అదృష్టం పరీక్షించుకునే అవకాశం ఉంది. ఆ గెలుపు తర్వాతే? సంజయ్ రాజకీయ జీవితం పెద్ద మలుపు తిరిగింది. అదేవిధంగా.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా 2018 లో అంబర్ పేట నియోజకవర్గం నుంచి ఓడిపోయాడు. తరవాత సికింద్రాబాద్ లోక్ సభ నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలుపొంది కేంద్రమంత్రి అయ్యారు.పార్టీల అవసరాలను బట్టి వీరిలో ఓడిపోయినా వాళ్ళ? మళ్ళీ ఎంపీ అభ్యర్థులుగా బరిలో ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఎంపీ సీట్లు గెలవటమే లక్ష్యం కాబట్టి, వీరిలో ఎమ్మెల్యేగా గెలిసిన అభ్యర్థులతో రాజీనామా చెపించి కూడా లోక్ సభ ఎన్నికల్లో పోటీకి దించినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఆసియా క్రీడల్లో

# తొలి స్వర్ణ పతకం సాధించిన ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

తుడిచిపెట్టుకుపోయింది. కాగా, మూడు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలతో పతకాల పట్టికలో ఏడో స్థానంలో ఉన్న భారత్.. ఈ స్వర్ణంతో ఆరో ప్లేస్‌కు చేరింది. 1890.1 పాయింట్లతో దక్షిణ కొరియా రజతం, 1888.2 పాయింట్లతో చైనా కాంస్య పతకాలు గెలుపొందాయి.ఈ ముగ్గురు అథ్లెట్లు వ్యక్తిగతంగానూ ఫైనల్‌కు చేరుకోవడం గమనార్హం. ఫైనల్ కోసం జరిగిన పోటీల్లో రుద్రాంక్ష్ మూడో స్థానంలో నిలువగా, తోమర్, దివ్యాన్ష్ ఐదు, ఎనిమిదో ప్లేసుల్లో నిలిచి టాప్-8లో ప్లేసు సంపాదించారు. అయితే ఏషియన్ గేమ్స్ నియమాల ప్రకారం ఒక దేశం నుంచి ఇద్దరు మాత్రమే ఫైనల్‌కు చేరుకుంటారు. దీంతో రుద్రాంక్ష్ పాటిల్, ఐశ్వరీ ఫైనల్‌కు అర్హత సాధించారు.

# పీఓపి విగ్రహాల నిమజ్జనం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

మరో న్యాయవాది వేణు మాధవ్ హైకోర్టు ముందు వాదనలు వినిపించారు. గత సంవత్సరం హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ పీవోపీ విగ్రహాలను హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం చేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాధి వాదనలు వినిపించారు. గత సంవత్సరం హైకోర్టు ఆదేశాల మేరకు హుస్సేన్ సాగర్ లో పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయలేదని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాలను జీహెచ్ఎంసీ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనుల్లో నిమజ్జనం చేసినట్లు తెలిపారు.సెప్టెంబర్ 28న గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఉన్నాయి. దాదాపు 35 ఏళ్ల తర్వాత ఈ రెండు వేడుకలు ఒకే రోజు వస్తున్నాయి. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం వేల మంది పోలీసులను ప్రభుత్వం నియోగించనుంది. ఇక మ్యాచ్ జరిగే రోజూ నిమజ్జనం కొనసాగుతుంది. అలాంటప్పుడు ముందు రోజే 24 గంటలు డ్యూటీ చేసిన పోలీసులు అలసిపోయే ప్రమాదం ఉంది. దాంతో మ్యాచుకు బందోబస్తు కష్టమని పోలీసు ఉన్నతాధికారులు హెచ్‌సీఏకు తెలిపారు. ఈ మేరకు మ్యాచ్ తేదీని మార్చాలని బీసీసీఐకి హైదరాబాద్ క్రికెట్ సంఘం విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది.రెండు రోజుల క్రితమే ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో తలపడే జట్టును న్యూజిలాండ్ ప్రకటించింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో గుజరాత్ - చెన్నై మ్యాచ్‌లో గాయమై శస్త్రచికిత్స చేయించుకొని ఇన్నాళ్లూ ఆటకు దూరమైన కేన్ మామ తిరిగి జాతీయ జట్టుతో చేరాడు. 15 మంది సభ్యులతో కూడిన జట్టులో కివీస్ నలుగురు పేసర్లు, ఇద్దరు పేస్ ఆల్ రౌండర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగుతోంది. మిగిలినవారిలో ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు ఉన్నారు. కాగా గతేడాది కివీస్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ వ్యక్తిగత కారణాల రీత్యా న్యూజిలాండ్ బోర్డు కాంట్రాక్టు వదులుకున్నా అతడిని ప్రపంచకప్ నేపథ్యంలో జట్టులో చేర్చారు. బౌల్ట్‌తో పాటు జేమ్స్ నీషమ్ కూడా కాంట్రాక్టు లేకున్నా వరల్డ్ కప్ జట్టులో చేరాడు. ఇక ఇంగ్లాండ్‌తో వన్డేలకు దూరమైన కైల్ జెమీసన్, ఆడమ్ మిల్నేలకు నిరాశతప్పలేదు.

# 30నే పాలమూరుకు ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

మందిని సభకు తరలించేలా జన సమీకరణపై దృష్టి పెట్టారు. సభా ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర నేతలు జితేందర్ రెడ్డి, ఆచారి పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నేతలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీని గ్రామాల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును, కాంగ్రెస్ గ్యారెంటీలపై విమర్శలు చేస్తూ.. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మోదీ పర్యటన తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలు రాష్ట్రానికి రానున్నారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి.. రాష్ట్ర నేతలతో సమావేశమై ఎన్నికల కార్యాచరణను ఖరారు చేస్తారని పార్టీ నేతలు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 119 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 3 మార్గాల్లో బస్సు యాత్ర చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం మొదటి ప్రణాళిక వేసుకుంది. ప్రస్తుతానికి బస్సు యాత్రలను వాయిదా వేసింది. బస్సు యాత్రల స్థానంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు సభలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభలను రాజకీయ సభలుగానే పరిగణించి.. వాటిని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభల తేదీలను.. ఒకటీ రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సభలను ప్రారంభించి.. ముఖ్యనేతలు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ నాయకులు పాల్గొనేలా షెడ్యూల్ రూపొందించాలని భావిస్తున్నారు. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది.. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన ఒకటీ రెండు రోజుల్లో ఉండనున్నట్లు తెలుస్తోంది.. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల జాబితాను కూడా వీలైనంత త్వరగా అక్టోబర్ మొదటి వారంలో వెల్లడించడానికి సిద్ధమవుతున్నారు రాష్ట్ర నేతలు. నియోజకవర్గానికి ముగ్గురు లేదా నలుగురి పేర్లను గుర్తించి.. సర్వేలు, పార్టీ నేతల అభిప్రాయాలు, వివిధ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ ముఖ్యనేతలంతా.. అసెంబ్లీ బరిలో నిలవాల్సి ఉంటుందని ఇప్పటికే జాతీయ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సహా ఇతర కీలక నేతలు అందరూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం దాదాపు ఖాయం అయిపోయినట్లు తెలుస్తోంది.

**ఇక వరుస పర్యటనలు**

రాష్ట్రంలో వాడిపోతున్న కమలాన్ని వికసించేలా చేయడంపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి పెట్టింది. అగ్ర నేతల వరుస పర్యటనలతో శ్రేణుల్లో జోష్ పెంచాలని చూస్తోంది. ఈ నెల 30 వ తేదీన పాలమూరుకు ప్రధాని మోడీ రానున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని ఐటీఐ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.వచ్చే నెల మొదటి వారంలో ఆదిలాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటించనున్నారు. సభను నిర్మల్‌లో పెట్టాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి పట్టుపడుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు రానున్నారు. షా పర్యటన తర్వాత పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణలో పర్యటించనున్నారు.కవిత లిక్కర్ కేసు విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేననే చర్చ ప్రజల్లో జరుగుతోంది. దాంతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చడం సైతం పార్టీకి మైనస్ అయింది. ఆ నష్టాన్ని పూడ్చుకోవడంలో భాగంగానే అగ్ర నేతల వరుస పర్యటనలు ఉండనున్నాయని తెలుస్తోంది. తెలంగాణకు ఇప్పటి వరకు ఏమిచ్చామో చెప్పుకుని పార్టీని పటిష్ట పర్చడంతోపాటు ప్రజలకు దగ్గరయ్యేలా హామీలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోపు మోడీ, అమిత్ షా, నడ్డా ఒక్కొక్కరు మూడు చొప్పున మొత్తం 9 భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మోడీ, షా, నడ్డాతో మూడు సభలు నిర్వహించనుంది. ఈ షెడ్యూల్ పూర్తయ్యే లోపు మరో దఫా ఈ నేతలు పర్యటించనున్నారు.పాలమూరు సభ అనంతరం అక్టోబర్ 3వ తేదీన నిజామాబాద్‌లో ప్రధాని మోడీ పర్యటించనున్నారు. పసుపు బోర్డు ఏర్పాటుపై మోడీ స్పష్టత ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్‌లో ప్రధానితో రోడ్ షో నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. దీని కోసం అర్వింద్ పట్టుపడుతున్నారు. అది సాధ్యపడకుంటే బహిరంగ సభ నిర్వహించాలని చూస్తున్నారు. నల్లగొండలోనూ ప్రధాని మోడీ తో సభ నిర్వహించాలని చూస్తున్నారు.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో కరీంనగర్‌లో సభ పెట్టాలని బండి ప్రణాళిక చేస్తున్నట్లు సమాచారం. అక్టోబర్ మొదటి వారంలో 6వ తేదీ లోపే రాష్ట్రానికి అమిత్ షా రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆపై నడ్డా టూర్ సాగనుంది. బస్సుయాత్రల స్థానంలో కొత్త జిల్లా కేంద్రాల వారీగా సభలు నిర్వహించాలని ప్లాన్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ లోపు మిగతా పార్లమెంట్ నియోజకవర్గాల్లో సభలు పూర్తి చేయాలని కమలనాథులు భావిస్తున్నారు.వచ్చే నెల నిర్వహించతలపెట్టిన బీజేపీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశంపై సందిగ్ధత నెలకొంది. త్వరలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించాలని భావించారు. అగ్రనేతల వరుస టూర్లు, సభలను సక్సెస్ చేయడంపై ఇందులో చర్చించాలని అనుకున్నారు. కానీ అదే రోజున ప్రధాని మోడీ సభ ఉండటంతో ఈ సమావేశం వాయిదా పడే అవకాశముంది. పాలమూరు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ్ సంకల్ప యాత్రకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరవుతున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి తెలిపారు. శనివారం భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్‌లో స్థలాన్ని జితేందర్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా బీజేపీ నేతలు పరిశీలించారు. భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

## సంపాదకీయం

# ఆర్థిక మూలాలపై దెబ్బ

భారత్ కెనడా మధ్య నెలకొన్న వివాదం కొనసాగుతున్న వివాదం తెలిసిందే. ఈ నేపథ్యంలో కెనడాలోని భారత వ్యతిరేక శక్తులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే ఇటీవల భారతీయులను బెదిరించిన సిఖ్స్ ఫర్ జస్టిస్ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూకు పంజాబ్‌లో ఉన్నటువంటి ఆస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ జప్తు చేసింది. అయితే ఇప్పుడు తాజాగా మరో ముందడుగు వేసింది ఎన్ఐఏ. వివిధ దేశాల్లో నివసిస్తోన్నటువంటి మరో 19 మంది ఖలిస్థానీ ఉగ్రవాదులకు చెందినటువంటి ఆస్తుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే త్వరలోనే వీళ్లకు చెందిన ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు సైతం వెల్లడించాయి. ఇప్పటికే.. వివిధ దేశాల్లో నివాసం ఉంటూ.. భారత్‌లో వేర్పాటువాదంపై ఖలిస్థాన్ సానుభూతిపరులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.అందులో ముఖ్యంగా బ్రిటన్, అమెరికా, కెనడా, దుబాయ్, పాకిస్థాన్ దేశాల్లో ఉంటున్నవారిని.. అలాగే ఇతర దేశాల్లో ఉంటున్న వారిని భారత్ ఇప్పటికే ఉగ్రవాదులుగా ప్రకటించేసింది. విదేశీ గడ్డపై ఉంటూ భారత్ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోన్న వీరి హవాలా కార్యకలాపాలను అలాగే స్థానికంగా ఉన్నటువంటి ఆస్తులపై ఎన్ఐఏ దృష్టి సారించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద వీళ్లందరిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది జాతీయ దర్యాప్తు సంస్థ. ఇందుకోసం దాదాపు 20 మందికి చెందిన ఆస్తులను జప్తు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరోవైప ఖలిస్థాన్ వేర్పాటువాదంతోపాటు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నటువంటి 43 మంది మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ జాబితాను కూడా దర్యాప్తు సంస్థ ఈ మధ్యే విడుదల చేసింది.అంతేకాదు వీళ్లకు చెందిన ఆస్తుల వివరాలను కూడా తెలియజేయాలని ప్రజలకు సూచనలు చేశారు. అలాగే వీళ్ల ఫొటోలను కూడా విడుదల చేసింది. అయితే ఈ జాబితాలో ఉన్న ఖలిస్థాని సానుభూతిపరులు ఎక్కువగా కెనడా దేశంలోనే ఉంటున్నట్లు ఎన్ఐఏ అంచనా వేస్తోంది. ఇదిలా ఉండగా.. కెనడాలోని భారతీయులను ఇటీవల బెదిరించినటువంటి నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూకు పంజాబ్‌లో ఉన్నటువంటి ఆస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ జప్తు చేసేసింది. ఇదిలా ఉండగా.. అమృత్‌సర్ శివారులోని గురుపత్వంత్ పూర్వీకుల గ్రామమైన ఖాన్‌కోట్‌లో అతనికి ఉన్న 5.7 ఎకరాల భూమిని.. అలాగే చండీగఢ్‌లో ఉన్నటువంటి నివాసాన్ని స్వాధీనం చేసుకుంది. కెనడాలో ఉంటున్న అతనిపై పంజాబ్, ఇతరప్రాంతాల్లో కలిపి మొత్తంగా 12 వరకు కేసులు ఉన్నాయి. మరోవైపు భారత్, కెనడాల మధ్య వివాదం ఎప్పుడు కొలిక్కివస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరో వైపు భారత్ కెనడా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలోనే ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురైన తరవాత అమెరికా నిఘా వర్గాలు కెనడాకి కీలక సమాచారం అందించినట్టు న్యూయార్క్ టైమ్స్ రిపోర్ట్ వెల్లడించింది. ఇదే విషయాన్ని అమెరికా దౌత్యవేత్త కూడా ధ్రువీకరించారు. ఫైవ్ ఐస్ పార్టనర్స్ అందించిన ఇంటిలిజెన్స్ రిపోర్ట్ ఆధారంగానే కెనడా భారత్‌పై ఆరోపణలు చేసినట్టు వెల్లడించారు. నిజ్జర్ హత్యకు, భారత్ ప్రభుత్వానికి కచ్చితంగా లింక్ ఉండే ఉంటుందని ఆ నివేదిక వెల్లడించినట్టు సమాచారం. అందుకే ట్రూడో ఆ వ్యాఖ్యలు చేశారు. కెనడాలోని న్యూస్ చానెల్ కూడా ఈ విషయాన్ని కన్‌ఫమ్ చేసింది. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ దేశాలతో కూడిన ఫైవ్ ఐస్ పార్టనర్స్ కూటమి నిఘా సమాచారాన్ని అందిస్తుంటుంది. సెప్టెంబర్ 18వ తేదీన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నిజ్జర్ హత్యకి, భారత్‌కి లింక్ ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల్ని భారత్ కొట్టి పారేసింది. 2020లోనే నిజ్జర్‌ని భారత్ ఉగ్రవాదిగా ప్రకటించింది. అయితే...కెనడాలోని అంకి ఇంటర్వ్యూ ఇచ్చిన క్రమంలోనే అమెరికన్ డిప్లమాట్ డేవిడ్ కొహెన్ చేసిన వ్యాఖ్యలు చాలా కీలకంగా మారాయి. నిజానికి చాలా రోజులుగా ఈ వాదన వినిపిస్తోంది. ఓ నిఘా వర్గం కెనడాకి సమాచారం అందించిందని, ఆ తరవాతే ట్రూడో ఇలా కామెంట్స్ చేశారన్న వార్తలు వచ్చాయి. కానీ...అధికారికంగా ఓ అమెరికా దౌత్యవేత్త ఈ విషయం వెల్లడించడం ఇదే తొలిసారి.అందించిన రిపోర్ట్ ఆధారంగానే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై ఆరోపణలు చేశారు. భారత్ కెనడా మధ్య రోజురోజుకీ వివాదం ముదురుతోంది. భారత్ వీసా సేవల్ని నిలిపివేసింది. ఈ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి"- డేవిడ్ కొహెన్, అమెరికా దౌత్యవేత్తఅయితే...ఈ ఇంటిలిజెన్స్ సమాచారం రెండు విధాలుగా అందేలా ఏర్పాటు చేసుకున్నాయి 5 దేశాలు. ఈ ఫైవ్ ఐస్ పార్ట్‌నర్స్ లోని ఓ దేశం సీక్రెట్‌గా ఈ సమాచారాన్ని అందించినట్టుగా వెల్లడించింది. అంటే...ఆ నిఘా కూటమిలోని ఏదో ఓ దేశం కెనడాకి వివరాలు ఇచ్చింది. కానీ ఏ దేశం ఈ పని చేసిందన్నది మాత్రం రహస్యంగానే ఉంది. అటు అమెరికా దౌత్యవేత్త డేవిడ్ కోహెన్ ఇంతకు మించి ఏమీ మాట్లాడలేదు. కొన్ని విషయాల్ని బహిరంగంగా చర్చించడం సరికాదని సమాధానాలు దాటవేశారు. ఇదంతా చూస్తుంటే..పక్కా ప్లాన్‌తో భారత్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారా అన్న అనుమానాలకు తావిస్తోందంటున్నారు కొందరు విశ్లేషకులు.

## రేపు సోనియా సమక్షంలో కండువా మార్చుకోనున్న మైనంపల్లి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఇటీవలే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మైనంప్లలి హనుమంతరావు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు తెలిపారు. అయితే ఈనెల 27వ తేదీన సోనియా గాంధీ సమక్షంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతారని మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. కాంగ్రెస్ రెండు అసెంబ్లీ సీట్ల విషయం సర్వే రిపోర్ట్ ఆధారంగా ఇవ్వమని అడిగినట్లు పేర్కొన్నారు. సర్వే రిపోర్ట్ ఆధారంగా మల్కాజిగిరి, మెదక్ టిక్కెట్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేసారని మీడియాకు వివరించారు. తన సన్నిహితుడు నక్కా ప్రభాకర్ గౌడ్ కు మేడ్చల్ అసెంబ్లీ సీట్ గురించి రిక్వెస్ట్ చేసినట్లు స్పష్టం చేశారు. మైనంపల్లిని పార్టీలోకి ఆహ్వానించేందుకు సోమవారం రోజు కాంగ్రెస్ నేతలు ఆయన నివాసానికి క్యూ కట్టారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మధుయాష్కీ గౌడ్, మహేష్ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, దామోదర రాజనరసింహ తదితరులు దూలపల్లిలోని మైనంపల్లి ఇంటికి చేరుకున్నారు. ఈక్రమంలోనే ఆయనతో చర్చించగా.. మైనంపల్లి పార్టీలో చేరేందుకు ఒప్పుకున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచే తాను పోటీ చేయబోతున్నట్లు శనివారమే మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు. కొందరు కావాలనే సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి రెండు నియోజక వర్గాల నుంచి తాను పోటీ చేస్తానని చెప్పిన మాటల్లో ఎలాంటి నిజం లేదన్నారు.

# తెలంగాణ వీర వనిత మన చాకలి ఐలమ్మ

(మొదటిపేజీ తరువాయి)

భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. అందులో నాలుగు ఎకరాలు సాగుచేశారు. పాలకుర్తి పట్వారీ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు. పాలకుర్తి పట్వారీ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ కోర్టులో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది.అయిలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన దేశ్‌ముఖ్ పట్వారిని పిలిపించుకొని, అయిలమ్మ కౌలుకు తీసుకున్న భూమిని తన పేరున రాయించుకున్నాడు. భూమి తనదని, వండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకురమ్మని వందమందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పువచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కూతురు సోమనర్సమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి పట్వారీ ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు.

'ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏవిధంగా నష్టపెట్టగలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది.నీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధె?ర్యంతో రోకలి బండ చేతబూని గూండాలను తరమి కొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన అయిలమ్మ సెప్టెంబర్ 10, 1985 న అనారోగ్యంతో మరణించింది.

# రాహుల్ కి అసదుద్దీన్ సవాల్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ టార్గెట్‌గా ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ విరుచుకుపడ్డారు. దమ్ముంటే హైదరాబాద్ వచ్చి రాహుల్ తనపై పోటీ చేయాలంటూ సవాల్ విసిరారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినంలో భాగంగా ఎంఐఎం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అసదుద్దీన్ ఓవైసీ తన పార్టీ నిర్ణయాన్ని ప్రకటించడంతోపాటు పలు కీలక అంశాలపై ప్రసంగించారు. టీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు అధికారికంగా స్పష్టం చేశారు. ఎంఐఎం పోటీ చేయని చోట బీఆర్ఎస్‌కు సపోర్ట్ చెయ్యాలని పార్టీ సభ్యులకు కార్యకర్తలకు, ఓటర్లకు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మతకలహాలన్నీ కాంగ్రెస్ వల్లే జరిగాయని.. బాబ్రీ మసీదు ఘటన కూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బాబ్రీ మసీదును పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలో కూల్చివేశారని, దాన్ని తిరిగి నిర్మించలేదని.. కానీ తెలంగాణ సచివాలయంలో కూలిపోయిన మసీదును కేసీఆర్ కట్టించారంటూ గుర్తుచేసే ప్రయత్నం చేశారు.దేశవ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒక చోట ముస్లింలను అవమాన పరుస్తున్నారని.. పదేపదే దాడులు జరుగుతున్నప్పుడు కూడా మోడీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. బీజేపీని ఓడించాలన్న అసదుద్దీన్ ఓవైసీ.. తెలంగాణలో తొమ్మిది సంవత్సరాల నుంచి బ్రహ్మాండంగా పరిపాలన నడుస్తుందోని ఎలాంటి మతకలహాలకు చోటు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం ముందుకెళ్తోందంటూ ప్రశంసించారు.

# మైనంపల్లి వర్సెస్ పద్మాదేవేందర్ రెడ్డి?

(మొదటిపేజీ తరువాయి)

చెందిన మైనంపల్లి రెండు టికెట్లు కోరటంతో? అందుకు నిరాకరించింది బీఆర్ఎస్. కేవలం మైనంపల్లికి మల్కాజ్ గిరి టికెట్ ను కేటాయించగా? మెదక్ టికెట్ ను సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికే ఇచ్చింది. దీంతో అసంతృప్తి చెందిన మైనంపల్లి శుక్రవారం?. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఆయన కుమారుడు మెదక్ లో పోటీ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో మెదక్ రాజకీయంలో కీలక పరిణామం చోటు చేసుకున్నట్లు అయింది.మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు కాంగ్రెస్ పార్టీ లో చేరటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆయన కుమారుడితో కలిసి ఢిల్లీకి బయల్దేరారు. ఆయన కాంగ్రెస్ లో చేరితే? ఇక్కడ ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ బరిలో ఉండే అవకాశం ఉంది. దీంతో పద్మాదేవేందర్ రెడ్డి, మైనంపల్లి మధ్య మరో ఎన్నికల యుద్దానికి మెదక్ నియోజకవర్గం సిద్ధమవుతుంది. మెదక్ జిల్లా నుండి రెండు సార్లు ఎమ్మెల్యే గా ఎన్నికైన మైనంపల్లి, తన కుమారుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ కు రాజకీయ భవిష్యత్తుకు పునాదులు వేయాలని చాలా రోజులుగా భావిస్తున్నారు. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రోహిత్ కి 2023 ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని అభ్యర్థించారు. కానీ అక్కడినుండి, సీనియర్ నాయకురాలు, వరుసగా ఇక్కడి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పద్మాదేవేందర్ రెడ్డి ఉండటంతో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఆదినాయకత్వం మరోసారి పద్మాదేవేందర్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతో? ఈ విషయంలో పార్టీ నాయకత్వంతో తీవ్రంగా విభేదించిన మైనంపల్లి? ఆర్థిక మంత్రి హరీష్ రావుతో పాటు పద్మాదేవేందర్ రెడ్డి పైన ఘాటైన విమర్శలు చేశారు.మైనంపల్లి 2008లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి? ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి పైన గెలిచారు. 2009 జనరల్ ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన లో భాగంగా రామాయంపేట నియోజవర్గాన్ని తీసివేయటంతో, మైనంపల్లి , పద్మాదేవేందర్ రెడ్డి ఇద్దరు మెదక్ నియోజకవర్గం నుంచి పోటీ చెయ్యాలని నిర్ణయించుకున్నారు. 2009 సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్, టిడిపితో పాటు వామపక్షాలు పొత్తుపెట్టుకొని మహాకూటమిగా ఏర్పాడటంతో? ఈ సీటుని టిడిపికి ఇచ్చారు. ఈ సీటు నుంచి మైనంపల్లిని మరోసారి బరిలోకి దించింది, బీఆర్ఎస్ నాయకత్వంతో విభేదించిన పద్మాదేవేందర్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేశారు.

ఈ ఎన్నికల్లో 20,000 భారీమెజార్టీ తో గెలిచారు మైనంపల్లి. అయితే పద్మాదేవేందర్ రెడ్డి కి సుమారుగా 23,000 ఓట్లు పోలయ్యాయి. అప్పట్నుంచే వీరి మధ్య దూరం మరింత పెరిగింది. 2010లో పద్మాదేవేందర్ రెడ్డి మళ్ళీ బీఆర్ఎస్ గూటికి చేరారు.ఇదిలా ఉంటే 2014, 2018 లో మెదక్ నుంచి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి అలవోకగా గెలిచారు పద్మా దేవేందర్ రెడ్డి. మైనంపల్లి కూడా 2014 ఎన్నికలకు ముందే బిఆర్ఎస్ లో చేరగా? ఆయనకు మల్కాజిగిరి ఎంపీ సీటు ఇచ్చి సర్దుబాటు చేసింది పార్టీ నాయకత్వం. ఆ ఎన్నికల్లో తాను ఓడిపోవటంతో, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని చేసింది. ఎమ్మెల్యే కావటం తన లక్ష్యంగా పావులు కదిపిన మైనంపల్లి 2018 ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి 74,000 ఓట్ల భారీ మెజారిటీ తో గెలిచారు.మెదక్ నియోజవర్గంలో పద్మాదేవేందర్ రెడ్డి కి తనకు ఎదురులేదు అని అనుకునే పరిస్థితుల్లో? మైనంపల్లి తన కుమారుడు రోహిత్ ని ఇక్కడి నుంచే అభ్యర్థిగా పోటీకి దింపుతానని ప్రకటించటం ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గంలో ఎన్నికల హడావుడి ముందే వచ్చినట్టు అయ్యింది. గత సంవత్సరంలో మైనంపల్లి రోహిత్ వందలాది సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, గతంలో మైనంపల్లి కి కూడా నియోజకవర్గంలో మంచి పట్టు ఉండటంతో? రోహిత్ కి పర్యటనల్లో మంచి స్పందన వచ్చింది . మొత్తంగా ఎన్నికల సమయం దగ్గర పడుతున్న వేళ... మెదక్ పాలిటిక్స్ మాత్రం హీట్ ను పెంచేస్తున్నాయి. అయితే ఈసారి ప్రజల ఆశీర్వాదం ఎవరు పొందుతారనేది ఆసక్తిని రేపుతోంది.

# బ్రిజ్ భూషణ్‌కు బిగిస్తున్న ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసినా పదేపదే అదే తప్పు చేశారని స్పష్టం చేశారు. "తజికిస్థాన్‌లో ఓ ఈవెంట్‌కి వెళ్లినప్పుడు ఓ మహిళా రెజ్లర్‌ని బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించారు. ఇదే విషయాన్ని బాధితురాలు మాకు చెప్పింది. తన గదికి పిలిపించుకుని ఆమెపై ఒత్తిడి చేసి గట్టిగా కౌగిలించుకున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఓ తండ్రిగా చేశానని, అందులో తప్పుడు ఉద్దేశం లేదని బ్రిజ్ భూషణ్ చెప్పారు. అంటే అదంతా తెలిసే చేసినట్టే కదా. బాధితురాలు వెంటనే స్పందించిందా లేదా అన్నది విషయం కాదు. కానీ ఆమెని వేధించారన్నది నిజం"మరో ఫిర్యాదు గురించీ ఢిల్లీ పోలీసులు కోర్టులో ప్రస్తావించారు. తజికిస్థాన్‌లో ఏషియన్ ఛాంపియన్ షిప్ జరిగినప్పుడు ఓ మహిళా రెజ్లర్‌తో అసభ్యంగా ప్రవర్తించినట్టు వెల్లడించారు. బలవంతంగా షర్ట్ పైకి అని పొట్టను తాకినట్టు తెలిపారు. ఆయా రెజ్లర్ల వాంగ్మూలం తీసుకున్నట్టు పేర్కొన్నారు. గతంలో ఈ కేసులో విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన కమిటీ బ్రిజ్ భూషణ్‌ని నిర్దోషిగా తేల్చలేదని, ఇదీ పరిగణనలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు వాదించారు. మహిళా రెజ్లర్ల చేసిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం కేంద్ర క్రీడామంత్రి నేతృత్వంలో ఓ కమిటీ వేసింది. ఆ కమిటీ రిపోర్ట్ ఇచ్చినప్పటికీ అందులో ఏముందన్నది బయట పెట్టలేదు. ఢిల్లీ పోలీసులకు మాత్రమే ఆ కాపీ అందించారు. ఈ కేసులో బ్రిజ్ భూషణ్ దోషిగా తేలితే మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు. జూన్ 15వ తేదీన భూషన్‌పై ఛార్జ్‌షీట్ కూడా దాఖలైంది. అక్టోబర్ 7వ తేదీన మరోసారి ఈ కేసుని ఢిల్లీ కోర్టు విచారించనుంది. చిఈఎ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తున్న రెజ్లర్లను సాక్ష్యాధారాలు ఉంటే చూపించాలని ఢిల్లీ పోలీసులు గతంలోనే అడిగారు. ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్న రెజ్లర్లతో మాట్లాడిన పోలీసులు "ఎవిడెన్స్" కావాల్సిందేనని తేల్చి చెప్పారు. ఆయన లైంగికంగా వేధించాడు అనడానికి సాక్ష్యంగా ఫోటోలు, వీడియోలు లేదంటే ఆడియో క్లిప్స్ ఏమైనా ఉంటే ఇవ్వాలని ఇద్దరు మహిళా రెజ్లర్లకు చెప్పారు. వాటిని ఆధారాలతో సహా ఇస్తేనే కేసు బలంగా ఉంటుందని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే ఓ రిపోర్ట్ కూడా తయారు చేశారు ఢిల్లీ పోలీసులు. బ్రిజ్ భూషణ్ చాలా సార్లు బలవంతంగా హగ్ చేసుకున్నాడని రెజ్లర్లు ఆరోపించారు. దీనికీ ఎవిడెన్స్ ఉందా అని ప్రశ్నించారు. ఈ ఏడాది ఏప్రిలే 21వ తేదీన ఇద్దరు మహిళా రెజ్లర్లు తమ స్టేట్‌మెంట్ ఇచ్చారు. బ్రిజ్ భూషణ్ తమతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపించారు. అఖీఖఅ సెక్షన్ 91 కింద ఈ రెజ్లర్లకు నోటీసులిచ్చారు పోలీసులు. "ఆరోపణలకు సంబంధించి ఏ సాక్ష్యం ఉన్న కచ్చితంగా సబ్మిట్ చేయాల్సిందే" అని తేల్చి చెప్పారు. బ్రిజ్ భూషణ్ బెదిరింపు కాల్స్ కూడా చేశారన్న ఆరోపణలకూ ఆధారాలు అడిగారు. ఫోటోలు, కాల్ రికార్డింగ్‌లు, వాట్సాప్ చాట్‌లు ఏమైనా ఉంటే ఆ వివరాలు ఇవ్వాలని తెలిపారు.

## ఫతుల్లగూడా-పీర్జాదీగూడ బ్రిడ్జికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఫతుల్లగూడా ? పీర్జాదీగూడ బ్రిడ్జికి రాష్ట్ర రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ, ఈసీపై రూ. 545 కోట్లతో 14 బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ మహా నగరానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిన నదిగా మూసీ నది ఉండేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో మూసీ నది మురికి కూపంగా మారింది. మూసీ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. అక్టోబర్ చివరి నాటికి నీటి శుద్ధీకరణ పనులు పూర్తవుతాయన్నారు. మూసీ, ఈసీపై రూ. 545 కోట్లతో 14 బ్రిడ్జిలకు శంకుస్థాపన చేసుకుంటున్నామని తెలిపారు. నిధులు పెరిగినా పరవాలేదు.. హైదరాబాద్ ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాలి. శాశ్వతంగా, దీర్ఘకాలికంగా ఉండేలా బ్రిడ్జిల నిర్మాణం చేపడుతామన్నారు. 2000 మిలియన్ లీటర్స్ ఫర్ డే కెపాసిటీతో ఎస్టీపీల నిర్మాణం చేస్తున్నాం. దుర్గం చెరువు వద్ద 7 ఎంఎల్‌డీ కెపాసిటీ ఎస్టీపీని నిర్మించాం. ఎస్టీపీలు పూర్తయితే మూసీలోకి పూర్తి స్థాయి శుద్ధి చేసిన నీటిని వదిలే పరిస్థితి. మంచిరేవుల ? ఒక్కొక్కటిగా సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు పూర్తి చేసి బ్రిడ్జిలు కడుతున్నాం. 160 కిలోమీటర్ల ఓఆర్ఆర్ చుట్టూ తిరగకుండా మధ్యలో మూసీ నది మీదుగా వెళ్లే విధంగా బ్రిడ్జిలు నిర్మిస్తాం. రూ. 5 వేల కోట్లతో రెండో విడుత ఎస్ఎన్‌డీపీ తొందరలోనే చేపడుతాం. జీవో 118లోని చిన్న చిన్న టెక్నికల్ సమస్యలను పరిష్కరిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## నారాయణ స్కూల్లో
# గణనాథుని ఉత్సవాలు




**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు:** చిన్నతనం నుంచే భక్తిశ్రద్ధలతో ఉండాలని కుత్బుల్లాపూర్ పరిధిలోని సుచిత్ర బ్రాంచ్ నారాయణ స్కూల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ జే హేమలత అన్నారు. గణనాథుని ఉత్సవాలను పురస్కరించుకొని చివరి రోజు నారాయణ స్కూల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు అన్న ప్రసాదం స్వీకరించి అనంతరం విద్యార్థులు వివిధ రకాల వేషాధారణలో వచ్చి ఆటపాటలతో కోలాటంతో వినాయకునికి నిమజ్జనం ఊరేగింపుగా చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పురుషోత్తం రెడ్డి కోఆర్డినేటర్ లు అంబిక, దీప్తి , పాఠశాల డిన్ ప్రకాష్ గౌడ్, ఏవో చంద్రశేఖర్, పిఇటి శేఖర్, టీచర్లు ప్రతిభ ,రోజారెడ్డి, అకౌంటెంట్ కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఎం ఈ ఓ ఆఫీసులో సమ్మె నోటీస్ అందజేత
### సిఐటియు మండల కన్వీనర్ చందు నాయక్



**యాచారం-ప్రభాత సూర్యుడు:** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా యాచారం మండల ఎంఈఓ ఆఫీసులో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎస్ చందు నాయక్ మాట్లాడుతూ సిఐటియు పోరాట ఫలితంగా అన్ని బిల్లులు విడుదల అయ్యాయని అన్నారు,కానీ మాకు అకౌంట్స్ ల్లో పడలేదు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు, విద్యాశాఖ మంత్రి జూలై నెల నుండి 3000 రూపాయల గౌరవ వేతనాన్ని ఇస్తామని చెప్పినప్పటికీ అందుకు అనుగుణంగా బడ్జెట్ విడుదల చేయలేదని అన్నారు, కొత్త మెనూ అమలు కోసం, రాగి జావా వండి పెట్టాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని తెలిపారు, ఈ విషయంలో జిల్లా అధికారులకు సైతం ఎటువంటి స్పష్టత లేకపోయినా, కొత్త మెనూ అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. పెండింగ్ బిల్లుల సాధన కోసం, 3000 రూపాయల గౌరవ వేతనం, ఏరియర్స్ తో సహా ఇవ్వాలని. పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని. గుర్తింపు కార్డులు ఇవ్వాలని.డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు స్కూల్లో వంట బంద్ పెట్టి 28వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరేందర్ పద్మ జగిని సువర్ణ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు

## బారసాలకి హాజరైన
## బి.ఎన్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేకర్ రెడ్డి




**యాచారం-ప్రభాత సూర్యుడు**

నందివనపర్తి గ్రామం లోని 3వ వార్డు సభ్యులు బండి ఉమారాణి అలెగ్జా%శీ%డర్ ఇంట్లో జరిగిన బారసాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.ఎన్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి హాజరై బండి శ్వేత సర్దార్ దంపతుల గారాల పట్టి ఆధ్య ను ఆశీర్వదించి శుభాషిస్సులు తెలియచేశారు. తదనం తరం గ్రామస్థులు పెద్దలు బంధువులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించిన శేకర్ రెడ్డి రాక వల్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మేకం శంకర్, కారొబార్ నూకం మహేందర్, పెరుమాండ్ల రమేష్, తెల్గమల్ల నరేందర్,రాజు, బండి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి రథోత్సవం

■ భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు ■ గోవిందనామస్మరణతో మారుమోగిన మాడవీధులు



**తిరుమల - ప్రభాత సూర్యుడు:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం 6.55 నుండి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్ప స్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవింద నామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. అనాదికాలం నుండి రాజులకు రథసంచారం ప్రసిద్ధం. యుద్ధాలలో కూడా విరివిగా రథసంచారం జరిగినట్లు భారతాది గ్రంథాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడు. ఇక ప్రసిద్ధ దేవాలయాలలో ఉత్సవవేళలో దేవుని ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఊరేగించే ఆచారం, ఆగమశాస్త్ర సిద్ధమై బహుళ ప్రచారంలో ఉంది. తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైంది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే" అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పనతో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో – స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం.

# ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం

### అదనపు కలెక్టర్లు బిఎస్.లత, టి.ఎస్. దివాకర్



**జగిత్యాల- ప్రభాత సూర్యుడు:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్లు బిఎస్.లత, టి.ఎస్. దివాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు అదనపు కలెక్టర్లు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 31 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టరు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా అధికారులు,కలెక్టరేట్ పర్యవేక్షకులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో పలు అభివృద్ధి పనులు

**అనకాపల్లి- ప్రభాత సూర్యుడు:** అనకాపల్లి కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని ఎంపీ సత్యవతి మీడియా సమావేశంలో వెల్లడించారు నిన్న జరిగిన బొజ్జనుకొండ అభివృద్ధి కార్యక్రమంలో 7.33 కోట్లు రూపాయలతో శంకుస్థాపన కార్యక్రమాలు కూడా మొదలుపెట్టారని అన్నారు. ఈ బొజ్జన్నకొండ అనకాపల్లి జిల్లాలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన పర్యాటకుల కేంద్రంగా ఎంపీ సత్యవతి అన్నారు. అలాగే అనకాపల్లి మండలం సుందరయ్య పేట గ్రామంలో 10 ఎకరాల్లోని కేంద్ర విశ్వవిద్యాలయం రప్పించడానికి అనేక విధాలుగా కృషి చేశామని అన్నారు .అనంతరం ఈ విశ్వవిద్యాలయం అన్ని అనుమంతులతో కేంద్ర ప్రభుత్వం 28 కోట్ల బడ్జెట్ను కూడా ఆమోదించిందని ఎంపీ సత్యవతి వెల్లడించారు. కేంద్రీయ విశ్వ విద్యాలయం కి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభిస్తామని మీడియా ద్వారా ఎంపీ సత్యవతి తెలియజేశారు. దేశవ్యాప్తంగా 27 కేంద్ర విశ్వవిద్యాలయాలు అనుమతులు వచ్చాయని. అందులో మరి ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రానికి 8 కేంద్ర విశ్వవిద్యాలయాలు మంజూరు విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్ర జగన్మోహన్ రెడ్డి కృషిచేసిన నందుకు ఎంపీ సత్యవతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆహార భద్రతా కార్డు కేవైసీ నింధలను పున:సమీక్షించాలి

**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు :** కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణి శాఖ మంత్రి పియూష్ గోయల్కి తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లేఖ రాసారు. ఆహార భద్రతా కార్డుల్లో కేవైసీ నిబంధనల వల్ల నష్టపోతున్న తెలంగాణ పౌరుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ కేంద్రం కేవైసీ నిబంధనలను పున:సమీక్షించాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. దేశం మొత్తం పరిస్థితులకు తెలంగాణ పరిస్థితులకు గల వైవిధ్యం విభిన్నమైనది, దశాబ్దాల కాంగ్రెస్ పాలనా వైఫల్యాల వల్ల సరైన ఉపాధి లేక ఇక్కడి ప్రజలు పెద్ద సంఖ్యలో గల్ఫ్, ఇతర దేశాలతో పాటు దేశంలోని బొంబాయి, బీవండి తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వేలాది మంది వలసలు పోయి బతికే దౌర్భాగ్య పరిస్థితులు తలెత్తాయి. ఈ దుస్థితిని రూపుమాపడానికే మా ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో సుధీర్ఘ పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నాము, సాధించిన తెలంగాణను దేశంలోనే అన్ని రంగాల్లో నెంబర్ వన్గా తీర్చిదిద్దుకుంటున్నాము, ఇప్పటికే సాగునీరు, తాగునీరు, పరిశ్రమల ఏర్పాటు తదితర కీలక రంగాల్లో గణనీయమైన వృద్దిని సాధించి మౌళిక వసతులు సహా అన్ని రంగాల్లో దేశానికి మార్గనిర్దేశకత్వం వహిస్తున్నాము, ఈ కృషితో ప్రస్తుతం వలసలను అరికట్టడంతో పాటు గతంలో వలసపోయిన తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున తిరిగి స్వరాష్ట్రం రావడానికి ప్రోత్సాహమిస్తున్నామని అన్నారు.కేంద్రప్రభుత్వ కేవైసీ నిబంధనల వల్ల ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలైన కరీంగనర్, నిజమాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాల ప్రజలు గల్ఫ్ దేశాలతో పాటు ఇతర చోట్లా... దక్షిణ తెలంగాణ ఉమ్మడి జిల్లాలైన మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ తదితర ప్రాంతాల ప్రజలు బొంబాయి తదితర చోట్ల పెద్ద సంఖ్యలో బతుకును వెల్లదీస్తున్నారు. వీరి ప్రయోజనాలు కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పున:సమీక్షించాల్సిన అవసర ముందని తమరికి ఈ లేఖ ద్వారా గుర్తు చేస్తున్నానని పేర్కొన్నారు.

# త్వరలో రాష్ట్రము లో ఎయిర్ అంబులెన్సులు

### రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

త్వరలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎయిర్ అంబులెన్సులు ప్రవేశపెట్టబోతున్నాం అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ మూలన అత్యవసర పరిస్థితి ఏర్పడిన హెలికాప్టర్ ద్వారా వారిని దవాఖానకు తరలిస్తాం. కోటీశ్వరులకే పరిమితమైన ఈ సేవలను పేదలకు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌ది మాత్రమే అని మంత్రి స్పష్టం చేశారు. రవీంద్ర భారతి వేదికగా తెలంగాణ వైద్యారోగ్య శాఖ పదేళ్ల ప్రగతి నివేదికను మంత్రి హరీశ్ రావు సోమవారం విడుదల చేశారు. ఇదే వేదికగా 310 మంది ఫార్మసిస్టులకు మంత్రి హరీశ్‌రావు పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నేడు ఫార్మసిస్టులుగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతూ వైద్య ఆరోగ్యశాఖ కుటుంబంలో చేరుతున్న 310 మంది ఫార్మసిస్టులకు స్వాగతం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో 105, టీవీవీపీ పరిధిలోని 135, డీఎంఈ 70 పోస్టులకు గాను మొత్తం 310 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో సేవలు బాగుండాలంటే అందరికీ తగినన్ని ఔషధాలు ఉండాలి. ఔషధాలను సమకూర్చడం, రోగులకు అందించడంలో ఫార్మసిస్టులది కీలకపాత్ర. ప్రభుత్వ ఉద్యోగం అనేది గొప్ప అవకాశం. ప్రైవేటు ఉద్యోగాలతో ఉపాధి దొరికితే.. ప్రభుత్వ ఉద్యోగులకు.. ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతుంది. రోగులకు చిరునవ్వుతో మందులు అందిస్తే వారు ఎంతో సంతోషిస్తారు అని హరీశ్‌రావు తెలిపారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుపై 26 న విచారించనున్న న్యాయస్థానం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను రద్దుపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీఎస్‌పీఎస్సీ ఆశ్రయించింది. ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ ఈ నెల 23న సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లింది. అత్యవసర విచారణకు లంచ్ మోషన్ అనుమతి కోరుతు పిటిషన్ దాఖలు చేసింది. అయితే దీనిపై మంగళవారం విచారిస్తామని హైకోర్టు డివిజన్ బెంచ్ తెలిపింది. దీంతో గ్రూప్ రద్దుపై హైకోర్టు మంగళవారం విచారించనుంది.కాగా, ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన తీరు, పరీక్ష నిర్వహణకు చేపట్టిన జాగ్రత్తలు తదితర అంశాలతో టీఎస్‌పీఎస్సీ అప్పీల్‌కు వెళ్లింది. అందులో ప్రధానంగా 3 అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. నిరుడు అక్టోబర్ 16న తొలిసారి గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసిన టీఎస్‌పీఎస్సీ.. ఈ ఏడాది జూన్ 11న నిర్వహించిన పరీక్షలో బయోమెట్రిక్‌ను ఎందుకు అమలు చేయలేదన్న విషయంపై డివిజన్ బెంచ్‌కు స్పష్టత ఇవ్వనున్నది. ప్రిలిమ్స్‌కు హాజరైన 2,33,506 మంది అభ్యర్థుల్లో కేవలం ముగ్గురి కోసం పరీక్షను మళ్లీ వాయిదా వేస్తే మిగిలిన 2,33,503 మంది ఇబ్బంది పడతారని, వారిపై ఆర్థిక భారం పడటంతోపాటు ఎంతో విలువైన సమయం వృథా అవుతుందనే విషయాన్ని ప్రధానంగా ప్రసావించబోతున్నది. గ్రూప్–1 ఉద్యోగానికి ప్రిలిమినరీ పరీక్షే ప్రధానం కాదని, మెయిన్స్ పరీక్ష కూడా ఉన్నదనే విషయాన్ని బలంగా వినిపించాలని కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది.

**యూపీఎస్సీలోనూ బయోమెట్రిక్ లేదు**

ఉద్యోగ నియామక పరీక్షకు తొలిసారి టీఎస్‌పీఎస్సీయే ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. సివిల్ సర్వీస్ నియామకాల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే పరీక్షల్లోనూ ఈ విధానం లేదు. నిరుడు అక్టోబర్ 16న గ్రూప్–1 ప్రిలిమ్స్ సమయంలో బయోమెట్రిక్ హాజరు తీసుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. అభ్యర్థుల్లో చాలా మంది ఒకేసారి పరీక్షా కేంద్రాలకు రావడం, సమయం సరిపోకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణం. వీటిని పరిగణనలోకి తీసుకున్న టీఎస్‌పీఎస్సీ రెండోసారి ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించినప్పుడు అభ్యర్థుల సౌలభ్యం కోసమే బయోమెట్రిక్ విధానాన్ని తొలగించింది. ఈ విషయాన్ని అభ్యర్థులందరికీ ముందుగానే తెలియజేయడంతోపాటు ప్రతి పరీక్షా కేంద్రంలో పకడ్బందీగా మూడంచెల తనిఖీలు చేపట్టింది. పరీక్ష జరిగిన రోజు ప్రాథమిక సమాచారం మేరకే అభ్యర్థుల సంఖ్యను తెలిపిన టీఎస్‌పీఎస్సీ.. ఓఎంఆర్ పత్రాల స్కానింగ్ తర్వాత మొత్తం అభ్యర్థుల సంఖ్యను ప్రకటించింది. ఈ అంశాలను కూలంకషంగా హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వివరించాలని కమిషన్ భావిస్తున్నది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215